రైతుల కన్నీళ్లే సర్కార్‌ను కూలుస్తయ్

- కాంగ్రెస్ కాదిది.. ఖూనీకోరు
- ఇందిరమ్మ కాదు.. తోడేళ్ల రాజ్యం
- అన్నదాతలవి సర్కారు హత్యలే
- మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతుల కన్నీళ్లను పారిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీకోరు సర్కారుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతుల కన్నీళ్లే కూల్చి వేస్తాయని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క రోజే నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవటం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులను వంచించి పొట్టనబెట్టుకుంటున్న సర్కారు, రైతుల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవటం లేదని మంగళవారం ఎక్స్‌వేదికగా ధ్వజమెత్తారు. 'తోడేళ్లలా ప్రాణం తీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమిది. కాంగ్రెస్ కాదిది ఖూనీకోర్. ఆత్మహత్యలు కావివి ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ చేసిన హత్యలు. రుణమాఫీ చేయకుండా తీసిన ప్రాణాలు.. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు.. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణశాసనం రాస్తాయి. వారి కన్నీళ్లే కపట సర్కారును కూల్చి వేస్తయి' అని నిప్పులు చెరిగారు.

విదేశాల్లో సగం.. కర్ణాటకలో మిగతా సగం

- పాలన గాలికొదిలేసిన వైనం
- మంత్రులపై సతీశ్‌రెడ్డి ఎద్దేవా

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కొందరు మంత్రులు విదేశాల్లో ఉండగా.. ఇంకొందరు కర్ణాటకలో మకాం వేశారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఒక్క మంత్రి అందుబాటులో లేరని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. పాలనన గాలికొదిలి గాలిమోటర్లలో సీఎం, మంత్రులు చక్కర్లు కొడుతున్నారని, పోలీసుల పహారాలో గ్రామసభలు జరుగుతుంటే వారు పర్యటనలో ఉన్నారని, వారి వివరాలను ట్వీట్‌కు జతచేశారు.

- విదేశాల్లో ఉన్న సీఎం, మంత్రుల శాఖలు: సీఎం, హోం, మున్సిపల్, విద్య, కార్మిక, గిరిజన, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, ఐటీ, పరిశ్రమలు, గనుల శాఖలు.
- కర్ణాటకలో: ఆర్థిక, నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు అండ్ భవనాలు, ఆరోగ్య, అటవీ, ఎక్సైజ్, బీసీ, రవాణా, వ్యవసాయ శాఖలు.

దేనికైనా పోలీసులు ఉండాల్సిందేనా?

- వాళ్లు లేకుండా పాలించలేరా?
- ప్రభుత్వాన్ని నిలదీసిన ఎర్రోళ్ల

హైదరాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పోలీసులు లేనిదే పాలన సాగేటట్టు లేదని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ముందు పోలీసులు ఉండాల్సిందేనా? అని ప్రశ్నించారు. చివరికి గ్రామ సభలు కూడా పోలీసుల మధ్యే జరుగాలా? అని నిలదీశారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏడో గ్యారెంటీ కింద ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అడుగడుగునా అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలతో అప్రజాస్వామిక పాలన సాగుతున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని, సీఎం, కొంత మంది మంత్రులు విదేశాల్లో, మిగిలిన కొందరు పక్కరాష్ట్రాల్లో పర్యటిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్నది ప్రజాపాలనా? పోలీసు పాలనా? అని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్‌ది ప్రజావ్యతిరేక పాలన

- గ్రామ సభల సాక్షిగా ప్రజావ్యతిరేకత తేటతెల్లం
- కోతలు కోస్తే తిరుగుబాట్లు తప్పవు
- ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా మధ్య గ్రామసభలా? : మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, జనవరి 21(నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. ముమ్మాటికీ ప్రజావ్యతిరేక పాలన..మీ సర్కారు వైఖరిపై ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో మీరు ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామసభల సాక్షిగా తేటతెల్లమైంది. ఊరూరా తిరగడబడుతున్న జనం..ఎక్కడికక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అర్హులందరికీ రైతురుణమాఫీ, రైతుభరోసా, పంటలకు బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పి భారీగా కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల్లో.. మంత్రులు పక్కరాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలనెవరు పట్టించుకోవాలని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా మధ్య గ్రామసభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని, పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఓ వైపు గ్రామసభలు నిర్వహిస్తుంటే, మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. అలాంటప్పుడు గ్రామసభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్టేనా? అర్హులకు పథకాలు ఎగ్గొడుతున్నట్టేనా? అంటూ ప్రశ్నించారు.

హామీలిస్తం.. ఎగ్గొడుతమంటే ఇట్లనే ఉంటది

'ఎన్నికల ముందు హామీలిస్తం.. ఇప్పుడు ఎగ్గొడుతం అంటే ప్రజలే తగిన గుణపాఠం చెప్తరు' అని హరీశ్ హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకుల పాపం అధికారులకు శాపంగా మారిందని పేర్కొన్నారు. సర్కారు నిర్వాకం చూస్తుంటే ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, పంటబోనస్, ఇందిరమ్మ ఇండ్లు అన్నీ దగా అనే విషయం స్పష్టంగా ప్రజలకు అర్థమైందని దుయ్యబట్టారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి నోళ్లు మూయించడం విడ్డూరమని విరుచుకుపడ్డారు. 'నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గపు పాలనను నిలదీస్తున్నది..అడుగడుగునా ప్రశ్నిస్తున్నది..మీ రాక్షస పాలనలో విసిగి వేసారిన ప్రజలు ఉప్పెనగా మారి ఉద్యమించకముందే కండ్లు తెరవండి' అంటూ చురకలంటించారు. ఇప్పటికైనా ప్రజలను హింసించడం మాని పాలనపై దృష్టి పెట్టిన ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కృష్ణా, గోదావరి బోర్డుతో తెలంగాణకు కాంగ్రెస్ అన్యాయం

కృష్ణా, గోదావరి బోర్డును ఏర్పాటు చేసి తెలంగాణకు అన్యాయం చేసింది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీయేనని, ఇందుకు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని హరీశ్ తేల్చిచెప్పారు. కృష్ణా, గోదావరి నదుల జలాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను ఏకిపారేశారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఉన్నదున్నట్టుగా ఖుల్లంఖుల్లాగా చెప్పిన విషయాన్ని హరీశ్ ఉదహరిస్తూ ఎక్స్ వేదికగా సీఎం సహా ఇతర మంత్రులు అసంబద్ధ వాదన చేస్తున్నారని తేలిపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోగడ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ఒప్పుకొన్న 34-66 శాతం ఒకే సంవత్సరానికి అని, క్యాచ్‌మెంట్ ఏరియా ప్రకారం తెలంగాణకు 71 శాతం నీటి కేటాయింపులు జరగాలని కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌ను కోరిందని స్పష్టం చేయడం విమర్శలు చేస్తున్న వారి నోళ్లు మూయించేలా ఉన్నదని తెలిపారు. నీటి వాటాలు తేల్చే వరకు 50-50 కేటాయించాలని 2015న తెలంగాణ ప్రభుత్వం కోరినట్టు కృష్ణా బోర్డు ముందు తేల్చడం వంటి అంశాలు దాచేస్తే దాగని సత్యాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో సెక్షన్ 89 పెట్టి, రాష్ట్రాల బదులు ప్రాజెక్టుల ఆధారంగా నీటి పంపిణీ జరిగేలా చేసింది, కృష్ణా, గోదావరి బోర్డును ఏర్పాటు చేసి తెలంగాణకు అన్యాయం చేసింది ముమ్మాటికీ కాంగ్రెస్సేనని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డీ.. ఇదేనా మీ ప్రజాపాలనా?

- పోలీసు పహారా మధ్య గ్రామసభలా?
- మాజీమంత్రి వేముల ధ్వజం

మోర్తాడ్, జనవరి 21: పోలీసుల పహారా మధ్య గ్రామసభలు నిర్వహిస్తారా..? రేవంత్‌రెడ్డీ.. ఇదేనా ప్రజాపాలన అని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నిజామాబాద్ జిల్లాలో మంగళవారం ప్రారంభమైన గ్రామసభల తీరుపై ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో నిలదీశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ నాయకులకే పెద్ద పీట వేస్తున్నారంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎక్కడికక్కడ నిలదీస్తున్నారని తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇండ్లు

మొక్కుబడిగా మంత్రుల స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. గ్రామసభల నిర్వహణ, ప్రజల స్పందన, నాలుగు పథకాలకు సంబంధించిన అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దనసరి అనసూయ మంగళవారం ఉదయం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో మొక్కుబడిగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చవుతాయని వెల్లడించారు. ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోనివారు వెంటనే చేసుకోవాలని సూచించారు.

ప్రజా వ్యతిరేకతతోనే మంత్రులు పరార్!

- గ్రామసభల్లో నిలదీతలు
- తట్టుకోలేని అధికారులు
- పారిపోయిన మంత్రులు
- ఎస్సీల సంక్షేమంపై రాష్ట్రంలోని రేవంత్ సర్కార్‌కు శ్రద్ధలేదు
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో కోరుకంటి చందర్, రవీందర్‌సింగ్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాన్ని ముందే ఊహించిన మంత్రులు గ్రామసభలకు రాకుండానే పారిపోయారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ టూర్‌లో ఉండగా, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ప్రారంభమైన గ్రామసభల్లో ప్రజాగ్రహం వెల్లువెత్తుతుందని చెప్పారు. హామీల అమలుపై అధికారులను ప్రజలు నిలదీస్తున్నారని, ప్రజా నిరసనను వారు తట్టుకోలేకపోతున్నారని తెలిపారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రవీందర్‌సింగ్, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్ కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలనలో, ఆన్‌లైన్‌లో, సమగ్ర సర్వేలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు. ప్రజలకు అధికారులు సమాధానాలు చెప్పలేని పరిస్థితులు తలెత్తాయని, రాష్ట్రమంతా గందరగోళంగా మారిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 66.47 లక్షల రేషన్‌కార్డులు ఇస్తే, అసలే ఇవ్వలేదని కాంగ్రెస్ మంత్రులు అబద్ధాలాడుతున్నారని మండిపడ్డారు. రేషన్‌కార్డులు ఎలా తగ్గించాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనగా ఉన్నదని తెలిపారు. రేషన్‌కార్డుల కోసం ఎన్నిసార్లు దరఖాస్తులు తీసుకుంటారని, కాలయాపన కోసమే దరఖాస్తుల పేరిట నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్‌కార్డులపై నిబంధనలు సరళతరం చేసి అర్హులందరికీ వెంటనే జారీచేయాలని డిమాండ్ చేశారు.

దళితులకిచ్చిన హామీల అమలేది?

రాష్ట్రంలోని దళితుల సంక్షేమానికి రేవంత్‌రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చారని, ఒక్కటి కూడా అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ మంత్రివర్గంలో దళితులకు సరైన ప్రాతినిధ్యమే లేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సరిగా అమలు కావడం లేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు రక్షణ చట్టం-2017 చట్టం ప్రకారం 5 వేల మందికి ఇవ్వాల్సిన రూ.45 కోట్ల పరిహారాన్ని ఎందుకివ్వడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేవెళ్ల దళిత డిక్లరేషన్‌ను వెంటనే అమలుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజాపాలనను గాలికొదిలేశారు!

- విదేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మరో క్యాబినెట్ మంత్రి శ్రీధర్‌బాబు
- కర్ణాటక పర్యటనలో మిగతా మంత్రులు
- ప్రభుత్వ పెద్దలు లేకుండానే గ్రామసభలు
- పల్లెల్లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు
- రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలకుల తీరుపై సర్వత్రా తీవ్రస్థాయిలో విమర్శల వెల్లువ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను గాలికొదిలేసింది. మంగళవారం రాష్ట్ర మంత్రివర్గం మొత్తం దేశ, విదేశీ పర్యటనల్లో మునిగితేలింది. ప్రజలు, రాష్ట్రం కోసం నిరంతరం కష్టపడుతున్నామని కాంగ్రెస్ పాలకులు చెప్పినవన్నీ శుద్ధ అబద్ధాలని తాజా ఘటనతో తేలిపోయింది. రాష్ట్రంలో ఒక్క మంత్రి కూడా లేకపోవడంపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మిగతా మంత్రులు మంగళవారం ఉదయమే కర్ణాటక బాటపట్టారు. బెళగావిలో కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రత్యేక విమానంలో వారు వెళ్లినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామంపై రాజకీయ విశ్లేషకులు, నిపుణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతగా ఒక్క మంత్రి కూడా రాష్ట్రంలో ఉండకపోవడం ఏమిటని మండిపడుతున్నారు. ఒకవేళ ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి గ్రామ సభలు జరుగుతున్నాయి. అధికారులు, నేతలను ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తున్నారు. ఇలాంటి సమయంలో ఆయా శాఖల మంత్రులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సి ఉంటుంది. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడం, ఎక్కడైనా ఘర్షణ పరిస్థితులు ఏర్పడితే తగిన నిర్ణయాలు తీసుకొని, అధికారులకు మార్గనిర్దేశం చేయడం వంటివి పనులు చక్కబెట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మంత్రులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంపై మండిపడుతున్నారు. మరోవైపు పాలకవర్గం మొత్తం దేశ, విదేశీ పర్యటనలకు వెళ్లిపోవడంతో.. అధికారులు సైతం లైట్ తీసుకున్నారు. సచివాలయంలోని అనేక కార్యాలయాలు అధికారులు లేక బోసిపోయి కనిపించాయి. దీంతో 'ఇదేనా ప్రజాపాలన? ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత?' అని ప్రజలు విమర్శిస్తున్నారు.

వలస వెళ్తే ఇల్లు లేనట్టే?

- లబ్ధిదారుల ఎంపికలో ఆధార్ కార్డు కీలకం
- ఇందిరమ్మ దరఖాస్తుల మూడంచెల వడపోత

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): పట్టణాలు, నగరాలకు వలసవెళ్లిన వారు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల కారణంగా ఇందిరమ్మ ఇండ్లను పొందే అవకాశాన్ని కోల్పోనున్నారు. ఆధార్ కార్డు ప్రకారం చిరునామా ఎక్కడ ఉంటే అక్కడే ఇల్లు మంజూరవుతుంది. పట్టణాల్లో ఉంటూ ఆధార్ కార్డులో చిరునామా ప్రకారం సొంత ఊర్లో ఇల్లు పొందాలనుకున్నా గ్రామసభ అభ్యంతరం చెబితే ఇల్లు మంజూరయ్యే వీలులేదు. ఈ మేరకు కేంద్ర మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు చోటుదక్కకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులను మూడంచల్లో వడపోస్తున్నారు. ఈ ప్రక్రియలో ఆధార్ కార్డు కీలకంగా మారింది. ఆధార్ కార్డు ద్వారా దరఖాస్తుదారుల పుట్టుపూర్వోత్తరాలన్నీ బయటకు వచ్చే అవకాశం ఉండడంతో ఒకవేళ తప్పుడు సమాచారం ఇచ్చినా ఇట్టే గుర్తించే అవకాశం ఉంది. గ్రామంలో ఇంటి జాగా ఉండి, ఆధార్ కార్డులో పట్టణం చిరునామా ఉన్నా ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ప్రజలు జిల్లాలనుంచి ప్రధాన పట్టణాలకు, హైదరాబాద్‌కు వచ్చి జీవిస్తున్నారు. వృత్తి-ఉద్యోగాల కోసం, కూలీ పనులకోసం వచ్చి, అద్దె ఇండ్లలో ఉంటూ.. పిల్లల చదువు కోసం ఇక్కడి చిరునామాపైనే ఆధార్ కార్డులు తీసుకున్నారు. ఇటువంటివారు ఇప్పుడు సొంత ఊళ్లలో ఇల్లు పొందే అర్హతను కోల్పోతున్నారు. వారికి ఎలాగూ హైదరాబాద్‌లో ఇంటి జాగా లేకపోగా సొంత ఊళ్లో కూడా ఇల్లు లభించే వీలు లేకుండా పోతున్నది. దీంతో వీరి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది.

సగం కూడా పూర్తి కాని దరఖాస్తుల పరిశీలన

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇండ్ల కోసం 82 లక్షలకుపైగా దరఖాస్తులు అందగా, వాటిలో సగం దరఖాస్తుల పరిశీలన కూడా పూర్తికాలేదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ పథకాన్ని చేపడుతున్నందున కేంద్రం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారమే లబ్ధిదారులను ఎంపిక చేయాలి. ఇందులో సోషియో-ఎకనమిక్ క్యాస్ట్ సర్వేతోపాటు ఇంటింటి సర్వే, గ్రామసభల ఆమోదం తప్పనిసరి. ఇల్లు లేని ఉన్నవారు, రెండు గదులలోపు కచ్చా ఇల్లు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తుదారులు ఉంటున్న ఇల్లును పరిశీలిస్తారు. వారి ఆధార్ కార్డు ఆధారంగా వారి వివరాలను ధ్రువపరుచుకుంటారు. ఆధార్ కార్డు ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తులు తదితర వివరాలన్నీ వెల్లడవుతాయి. దీంతో ఏ విధంగానూ తప్పుడు సమాచారం ద్వారా ఇందిరమ్మ ఇల్లు పొందే ఆస్కారం లేదని అధికారులు చెప్తున్నారు.

సగానికిపైగా బుట్టదాఖలే!

ఇంటి లబ్ధిదారుల ఎంపికకోసం విధించిన నిబంధనల వల్ల సగానికిపైగా దరఖాస్తులు తిరస్కారానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులే అంటున్నారు. పూర్తిగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు తప్ప.. హైదరాబాద్ వంటి నగరాల్లో కూలి పనులు చేసుకొని బతుకున్నవారికి కూడా ఇల్లు లభించే వీలు లేదని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే.. ఇంట్లో ఇద్దరు వ్యక్తులు కూలి పనిచేసినా కుటుంబ ఆదాయం నెలకు రూ. 30వేలు దాటుతుందని, అందులో వారు ఎంతోకొంత పొదుపు చేసుకున్నా ఆ వివరాలన్నీ ఆధార్ కార్డు ద్వారా వెల్లడవుతాయని పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం మైదాన ప్రాంతాల్లో నిర్మించే ఇండ్లకు రూ.1.2 లక్షలు, కొండ ప్రాంతాలు, నార్త్-ఈస్ట్ రాష్ట్రాల్లో 1.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తుంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుతుంది.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ఇలా...

- సోషియో-ఎకనమిక్ క్యాస్ట్ సెన్సెస్
- ఇంటింటి సర్వే
- గ్రామసభల ఆమోదం

అనర్హతలు

- రూ. 50వేలు, అంతకన్నా ఎక్కువ పరిమితి గల కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్నవారు
- ప్రభుత్వ ఉద్యోగులు, వ్యవసాయేతర వాణిజ్యం నిర్వహించేవారు
- రూ. 15000, అంతకన్నా ఎక్కువ నెల వేతనం పొందుతున్నవారు, ఆదాయపు పన్ను చెల్లించేవారు
- రిఫ్రిజిరేటర్, ల్యాండ్‌లైన్ ఫోను, 2.5ఎకరాల కన్నా ఎక్కువ సాగుభూమి ఉన్నవారు